9న జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: రాందేవ్ రావ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మార్చి 9న జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకునే వారు మార్చి 5వ తేదీ లోగా తమ పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, పత్రిక పేరు, ఫోన్ నెంబర్‌ను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ వైద్య శిబిరంలో గుండె, కిడ్నీ, లివర్, రక్త పరీక్షలు, ఎముకలకు సంబంధించిన పరీక్షలు, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్, మహిళలకు గైనకాలజీ పరీక్షలు సుమారు రూ. 30 వేల ఖర్చుతో కూడిన వైద్య పరీక్షలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు దేవాంగ కుటుంబ సభ్యుల సమ్మేళనం

చింతల్: తెలంగాణ దేవాంగ సంఘం ఆధ్వర్యంలో గురువారం చింతల్ హెచ్‌ఎంటీ గ్రౌండ్ ప్రాంగణంలో దేవాంగ కుటుంబ సభ్యుల సమ్మేళనం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమ్మేళనంలో శివపార్వతుల పూజ, భజన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం భోజనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చింతల్: ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం చింతల్ హెచ్‌ఎంటీ కాలనీలోని పోచమ్మ ఆలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉషారాణి నేచురోపతి క్లినిక్ అక్యుపంచరిస్ట్ రాధిక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరంలో బీపీ, డయాబెటీస్ టెస్టులతో పాటు ఇతర పరీక్షలపై 20 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం


చెక్కు అందజేస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీలోని బౌరంపేట ప్రాంతానికి చెందిన నవీన్ కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును బుధవారం బౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నవీన్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫిషర్మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోచి మహేష్, దుండిగల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి అర్కల విజయ్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది సురేష్ పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్: బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతుల నిమిత్తం 11కేవీ మల్లంపేట, ఏసీ టైర్లు, శ్రీహోమ్స్‌లలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 2 గంటల వరకు శ్రీహోమ్స్ కాలనీ, బృందావన్ కాలనీ, బ్లాక్ డైమండ్ కాలనీ, కేవీఆర్ ప్యారడైజ్ కాలనీ, క్రాంతి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

33/11కేవీ మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ ఫీడర్‌లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 2 గంటల వరకు లక్ష్మీనగర్, కేంద్రీయ విహార్ రోడ్డు, మయూరి నగర్, రత్నదీప్ వెనుక భాగం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు. అదేవిధంగా మియాపూర్ ఎక్స్ రోడ్డు సబ్‌స్టేషన్ నుంచి శ్రీలా గార్డెన్స్ ఫీడర్‌లో శ్రీలా గార్డెన్స్, నడిగడ్డ తండా, దోవ కాలనీలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11కేవీ లోటస్ కాలనీ ఫీడర్‌లో లోటస్ కాలనీ, నాగార్జున ఎన్‌క్లేవ్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా గుల్‌మొహర్‌పార్కు కాలనీ, ఆర్‌డీబీ ఫీడర్ల పరిధిలో.. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు.

◆ 11 కేవీ గుల్‌మొహర్‌పార్కు కాలనీ, ఆర్‌డీబీ ఫీడర్‌ల పరిధిలో.. గుల్‌మొహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్, జీహెచ్‌ఎంసీ మున్సిపల్ ఆఫీస్ ఏరియా, ఆలిండ్ కంపెనీ ఏరియా, ఆర్‌డీబీ అపార్టుమెంట్స్ ఏరియాల్లో విద్యుత్ ఉండదన్నారు.


ఏకాంబరేశ్వర శివాలయంలో క్యూ లైన్‌లో ఉన్న భక్తులు


ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

శివనామ స్మరణ

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉదయం నుంచే పూజలు, అభిషేకాలు



కూకట్‌పల్లి నియోజకవర్గం జంట సర్కిళ్ల పరిధిలో బుధవారం శివాలయాల్లో మహా శివ రాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శైవ క్షేత్రాల్లో ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. స్వామివారి అభిషేకానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలతో పాటు రుద్ర హోమం, బిల్వపత్రి పూజలు చేశారు. స్వామివారికి సామూహిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలతో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంతాలు మారుమ్రోగాయి. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

– కూకట్‌పల్లి(జోన్‌బృందం)


మూసాపేటలోని సిద్ధి లింగేశ్వర స్వామిని దర్శించుకున్న బండి రమేష్, వెంకటేశ్వరరావు


సాయినగర్ మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్ రెడ్డి


మూసాపేటలోని పాత శివాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు


భరత్‌నగర్ కాలనీ హరిహర క్షేత్రంలో..


అవంతినగర్ తోట శివాలయంలో పూజలో మహిళా భక్తులు


వివేకానందనగర్‌లోని బ్రహ్మకుమారి కేంద్రం పూజలో ఏసీపీ శ్రీనివాసరావు

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సుమిత్రనగర్‌లో సత్యవేద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకూ ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. రాకపోకలు సాగించే క్రమంలో నీళ్లకు ఇబ్బంది పడకుండా ఉండటానికి చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి పలు ప్రాంతాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, పురేందర్ రెడ్డి, దొడ్ల రామకృష్ణ గౌడ్, కాశీనాద్‌యాదవ్, సత్యవేద ఫౌండేషన్ మేనేజర్ విజయకుమార్, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎడ్వర్డ్ రాస్, పాస్టర్లు మాణిక్యం, కొమ్ము సాగర్, దాసు, వినయ్, జాన్, రమేష్, రవి, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలి

బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్ అన్నారు. ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మసీద్‌బండలోని ప్రభుత్వ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎంపీ సేవా కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, వసంత్‌యాదవ్, రామరాజు, వెంకటస్వామి రెడ్డి, మహేశ్‌యాదవ్, రాధాకృష్ణ యాదవ్, రాజేష్‌గౌడ్, లక్ష్మణ్, వంశీ పాల్గొన్నారు.

చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్: చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఘట్‌కేసర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలో ఐదేళ్ల చిన్నారిని కావటి శ్రీధర్ (21) అనే యువకుడు మంగళవారం రాత్రి సమీపంలోని ఇంటి సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. స్థానికులు గమనించి అతడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం కుటుంబ సభ్యులు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవింద నరేష్ తెలిపారు. బుధవారం (ఎంఎస్‌ఎఫ్) నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎంఎస్‌ఎఫ్ ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షత వహించగా గోవిందు నరేష్ ముఖ్యఅతిథిగా హాజరై పలు అంశాలపై మాట్లాడారు.

ప్రమాదకరంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్

- నాసిరకంగా మరమ్మతులు
- అధికారుల పర్యవేక్షణ కరువు

నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి. నాసిరకంగా ఉండటంతో మరికొన్ని ధ్వంసమయ్యాయి. 21 డివిజన్ అదిత్య గార్డెన్స్, బాచుపల్లి, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. కాలనీలోని ప్రధాన రోడ్డుపై ఆరు నెలల నుంచి ఈ మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్ హోల్స్ పై మూతలు లేకపోవడం, అదే విధంగా నాలాలపై ఉన్న పై కప్పు సైతం ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో మ్యాన్‌హోల్స్‌ను గుర్తించక ప్రజలు, వాహనాదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిర్మాణం చేసే సమయంలో కాంట్రాక్టర్లు నాసిరకమైనవి వాడటం వల్ల కూడా ధ్వంసమవుతున్నాయని తెలుస్తోంది. డ్రైనేజీ పనులు చేపట్టే సమయంలో అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపట్టి నాణ్యత ఉండే విధంగా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి పరిస్థితులు ఎదురుకావని స్థానికులు పేర్కొంటున్నారు.


ఆదిత్య గార్డెన్స్‌లో కూలిన డ్రైనేజీ మ్యాన్‌హోల్


బాచుపల్లిలో ప్రధాన రోడ్డు పక్కనే..


నిజాంపేట్ డబుల్ బెడ్ రూం వైపు వెళ్లే రోడ్డులో..

ఆస్తి పన్ను హైప్..!

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను మదింపునకు ఆదేశాలు

- 2025–26 ఆర్థిక సంవత్సరంలో నూతన విధానం అమలు
- శివారు 29 పురపాలికల్లో వ్యవసాయేతర ఆస్తుల విలువలు సవరించి ఆస్తి పన్ను ఖరారుపై కసరత్తు
- వివరాల సేకరణలో పుర అధికార యంత్రాంగం
- నగర శివారు11 పురపాలికల్లో 40 గ్రామ పంచాయతీల విలీనం

సాక్షి,సిటీబ్యూరో: పురపాలికల్లో ఆస్తి పన్ను మదింపునకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయండతో 2025–26 ఆర్థిక సంవత్సరంలో నూతన విధానం అమలు కానున్నది. ఈ మేరకు మున్సిపాలిటీల పరిధిలోని వ్యవసాయేతర ఆస్తుల విలువలు సవరించి ఆస్తి పన్ను విధించనుండగా, ఎంత పన్ను పెరగనున్నదో వివరాలు సేకరించే పనిలో పుర అధికారులు నిమగ్నమయ్యారు.

ఖాళీ స్థలాలపై పన్ను

నగర శివారు పురపాలికల్లో చాలామంది ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టకుండా వదిలేస్తున్నారు. ఇలా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో వేల సంఖ్యలో ఖాళీ (ప్లాట్లు)స్థలాలున్నాయి. వీటికి వీఎల్ (వేకెండ్ ల్యాండ్ ట్యాక్స్) విధించాల్సి ఉంటోంది. అయితే పురపాలికల్లో అధికారులు పట్టించుకోకపోవడంతో వీటికి ఇప్పటివరకు ఎలాంటి పన్నులు విధించని పరిస్థితి నెలకొన్నది. ఇక మీదట ఖాళీ స్థలాలకు వీఎల్ పన్ను చెల్లించమంటే కుదరదు. ఆస్తి విలువలో కనిష్ఠంగా 0.05, గరిష్ఠంగా 0.20 శాతం పన్ను ఖరారు చేయనున్నారు. ఖాళీ స్థలాల్లో భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణానికి అనుమతి తీసుకోవాలంటే..వీఎల్ పన్ను రసీదును జత చేయాల్సి ఉంటోంది. మున్సిపాలిటీల్లో నిధులు లేకపోవడంతో తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులు, అభివృద్ధి పనులకు సైతం ఇబ్బందిగా మారుతోంది. అయితే ఇప్పుడు ఆస్తి పన్ను ద్వారా వచ్చే ఆదాయంతో వేతనాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను మదింపు ప్రక్రియ పూర్తి చేసి కొత్త పన్ను విధానం అమలు చేసేలా కసరత్తు చేస్తున్నట్లు మున్సిపల్ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



ఆస్తి పన్ను నిబంధనలు ఇలా..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 మున్సిపాలిటీలు ఉన్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నివాస భవనాలకు నిర్మాణ విలువలో కనిష్ఠంగా 0.10 శాతం, గరిష్ఠంగా 1 శాతం ఆస్తి పన్ను పెంచనున్నారు. వాణిజ్య భవనాలకు మార్కెట్ విలువలో కనిష్ఠంగా 0.25 శాతం, గరిష్ఠంగా 2 శాతం పన్ను పెరుగుతోంది. పురపాలక చట్టం ప్రకారం 75 గజాల్లోపు ఉన్న భవనానికి ఆస్తి పన్ను పెంపు వర్తించదు. వీటితో పాటు చారిత్రక భవనాలు, ఆసుపత్రులు, పురపాలక భవనాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు మినహాయింపు ఉంటుంది.

పన్ను మదింపుపై కసరత్తు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రస్తుతం 13 పురపాలక సంఘాల నుంచి వివిధ పన్నుల ద్వారా రూ.190 కోట్ల ఆదాయం సమకూరుతుండగా, రంగారెడ్డి జిల్లాలోని 16 మున్సిపాలిటీల నుంచి రూ.175 కోట్లు వసూలు అవుతున్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల ప్రభుత్వం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 7 పురపాలక సంఘాల్లో సమీపంలోని 28 గ్రామ పంచాయతీలను విలీనం చేయగా, రంగారెడ్డి జిల్లాలో 4 పురపాలక సంఘాల్లో 12 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. దీంతో విస్తరించిన ఆయా పురపాలక సంఘాలకు వివిధ పన్నుల ద్వారా ఆదాయం పెరిగే అవకాశమున్నది. మున్సిపాలిటీల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కాలనీల సంఖ్య కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో ఆయా కాలనీల్లో మౌలిక వసతులను కూడా పురపాలక సంఘాలే కల్పించాల్సిన అవసరముండడంతో అందుకు అనుగుణంగా ఆస్తి పన్ను మదింపుపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.


కీసరలో దర్శనం కోసం క్యూలో భక్తులు

కీసరగుట్ట కిటకిట

కీసర: కీసరగుట్ట శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం రోజున శివుడిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతందన్న నమ్మకంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఐదంతస్తుల రాజగోపురానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు పసుపు, కుంకుమ, పాలు, నూనె, నెయ్యితో అభిషేకాలు నిర్వహించారు. మరోవైపు బ్రహోత్సవాల్లో భాగంగా ఆలయంలో వేద పండితులు స్వామివారికి నందివాహన సేవను వైభవంగా నిర్వహించారు. రాత్రి 12 గంటలకు (లింగోద్భవకాలంలో) శ్రీరామలింగేశ్వర స్వామికి సంతతధారాభిషేకం పూజను నిర్వహించారు. సాయంత్రం వరకు దాదాపు లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, జిల్లా ఉన్నతాధికారులు, డీసీపీ పద్మజా, ఏసీపీ నరేందర్‌గౌడ్, అధికారులు దర్శనం త్వరగా అయ్యేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ , రాజ్యసభ సభ్యుడు, డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీ ఈటల రాజేందర్, దేవాదాయ శాఖ కమిషనర్ సుబ్రహ్మణ్యం, పలువురు జడ్జిలు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకున్నారు.


గర్భాలయంలో శ్రీరామలింగేశ్వరస్వామివారు


పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ తదితరులు


విద్యుత్ దీపాలతో కీసరగుట్ట ఆలయం



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

విరగ కాసె.. జనం ఎగబడి చూసె..

మామిడిచెట్టు చిన్నదే. కాయలేమో ద్రాక్ష గుత్తుల్లా విరగకాసింది. ఈ విడ్డూరాన్ని చూసేందుకు జనం ఎగబడి వస్తున్నారు. జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని సయ్యద్ అల్తాఫ్ హుస్సేన్ ఇంటి ముందు కేవలం మూడు అడుగుల ఎత్తులో ఓ గున్న మామిడి చెట్టు ఉంది. దీనికి ద్రాక్ష పండ్ల గెల మాదిరిగా పండ్లు విరగకాసింది. అటుగా వెళ్లేవారు దీనిని ఆసక్తిగా చూస్తూ ముక్కున వేలేసుకుంటున్నారు.

– సుభాష్‌నగర్



అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ పంపిన ఎమ్మెల్యే

సనత్‌నగర్: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ పంపారు. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బన్సీలాల్‌పేటలోని ముస్లీం బస్తీకి చెందిన షేక్ ముక్రం ఖదీర్, ఎక్రం ఖదీర్, ఇమ్రాన్ ఖదీర్‌లు ఈ నెల 28వ తేదీన అజ్మీర్ దర్గాలో చాదర్‌ను సమర్పిస్తారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు లక్ష్మీపతి, నాగభూషణం, ముస్లిం బస్తీవాసులు ఫహీం, అబ్బాస్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

